క్లుప్తంగా

పంపిణీకి సిద్ధం



కిట్లు సిద్ధం చేస్తున్న సిబ్బంది

సత్యవేడు: ఈ ఏడాది విద్యా సంవత్సరానికి పాఠశాలలకు వచ్చిన పాఠ్యపుస్తకాలు, దుస్తులు, బెల్టులను విద్యాకానుక పంపిణీకి ఎమ్మార్సీ సిబ్బంది సిద్ధం చేస్తున్నట్లు స్టాక్ పాయింట్ పాఠశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులు తెలిపారు. శనివారం స్టాక్‌పాయింట్‌లో 65 పాఠశాలలకు పంపిణీకి సిద్ధం చేసిన కిట్లను ఆయన పరిశీలించారు. మండల పరిధిలో 4,339 కిట్లు సిద్ధం చేశారన్నారు. 1వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు కిట్లు అందజేస్తారని తెలిపారు. సీఆర్ఎంటీలు బాలకృష్ణ, రామారావు, మునస్వామి, కుమార్, ఎంఐఎస్ స్వాతి, డేటా ఎంట్రీ ఆపరేటర్ మోహన్, ఐఈఆర్‌టీ దివ్య పాల్గొన్నారు.

ఆగమోక్తంగా శనీశ్వరస్వామికి తైలాభిషేకం



ప్రత్యేక అలంకారంలో శనీశ్వరస్వామి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో శ్రీశనీశ్వరస్వామికి శనివారం ఆగమోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి నువ్వుల నూనె, పాలు, పెరుగు, చందనం, నారికేళం, కలశ జలాలతో అభిషేకం చేశారు. అనంతరం స్వామివారిని విశేషంగా అలంకరించారు. ప్రత్యేక పూజలు నిర్వహించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. పాలకమండలి సభ్యులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

పలువురి రాజీనామా

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలికి పలువురు సభ్యులు శనివారం రాజీనామా చేశారు. ఇందులో తబ్జుల సుబ్బరామ గుప్తా, కే.కృష్ణకుమార్, పీ.మునిచంద్ర రాజీనామా చేసిన వారిలో ఉన్నారు. వారు మాట్లాడుతూ ప్రజాతీర్పును గౌరవిస్తూ తాము ఈ నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించారు.

భూ ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి

తొట్టంబేడు : తొట్టంబేడు పంచాయతీ పరిధిలో సర్వే నంబర్ 77–14బీలో ఉన్న చాకలి మాన్యం భూమిని కబ్జాదారుల నుంచి కాపాడాలని రజక సంఘం రాష్ట్ర కార్యదర్శి సంజాకుల మురళి శనివారం ఓ ప్రకటనలో కోరారు. కొన్ని సంవత్సరాలుగా కొందరు చాకలి మాన్యం భూ ఆక్రమించి, కట్టడాలు సైతం ప్రారంభించినట్లు పేర్కొన్నారు. చాకలి మాన్యం కాపాడుకునేందుకు రజక సంఘం సంవత్సరాల తరబడి పోరాటం చేస్తోందని తెలిపారు. గతంలో ఓ తహసీల్దారు చాకలి మాన్యం భూమిని చూపినా, హద్దులు చూపకుండా కాలయాపన చేశారని పేర్కొన్నారు. ఈనేపథ్యంలో కొందరు ఆక్రమణదారులు ఈ భూముల్లో కట్టడాలకు యత్నిస్తున్నట్లు తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి చాకలిమాన్యం ఆక్రమణలకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

రేపు హనుమాన్ శోభాయాత్ర

వెంకటగిరి రూరల్: హనుమాన్ జయంతిని పురస్కరించుకుని విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం హనుమాన్ శోభాయాత్ర నిర్వహించనున్నట్లు పట్టణ అధ్యక్షుడు వడ్లమూరి భాస్కర్, ప్రఖండ అధ్యక్షుడు నర్రా రవి పిలుపునిచ్చారు. పట్టణంలోని రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం విలేకరులతో మాట్లాడుతూ సాయంత్రం 4 గంటలకు హనుమాన్ శోభాయాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు.

వైభవంగా మహాశివుని రుద్రాభిషేకం

పుత్తూరు: వడమాలపేటలోని భవానీ శంకర స్వామికి శనివారం మహా రుద్రాభిషేకం వైభవంగా నిర్వహించారు. మహాశివుని జన్మ నక్షత్రమైన ఆరుద్ర సందర్భంగా వేకువజామున గణపతి పూజ, గోపూజ, స్వస్తి వాచన, ఏకాదశ రుద్ర కలశస్థాపన నిర్వహించారు. మహాశివుడి మహాలింగానికి వేదమంత్రాల నడుమ పంచామృత అభిషేకం చేశారు. అనంతరం రుద్ర గమకాలు పఠిస్తూ మహారుద్రాభిషేకాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. శివ పార్వతుల ఉత్సవమూర్తులకు పట్టు పీతాంబరాలు, విశేష స్వర్ణాభరణాలు, సుగంధ పరిమళభరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

ఎంటర్ ది డ్రాగన్

సంప్రదాయ పంటలను వదలి లాభాలనిచ్చే డ్రాగన్ ఫ్రూట్ సాగు చేస్తూ రైతులు రమణారెడ్డి, గజేంద్రనాయుడు ఆదర్శంగా నిలుస్తున్నారు. ఏడాదికి ఎకరాకు రూ.లక్షల ఆదాయం, ఒకసారి సాగు చేస్తే 30 ఏళ్ల వరకు దిగుబడి వస్తుందని రైతులు చెబుతున్నారు.



డ్రాగన్ ఫ్రూట్ తోట

బుచ్చినాయుడుకండ్రిగ: విదేశాల్లో సాగు చేసే డ్రాగన్ ఫ్రూట్ ప్రస్తుతం మండలంలోని కాటూరు, పూసలపల్లి గ్రామాలకు వచ్చింది. దీంతో డ్రాగన్ పండ్ల తోటల సాగు ఇప్పుడు అందరి చూపును ఆకర్షిస్తోంది. శ్రీకాళహస్తి–తడ రహదారికి ఆనుకుని కాటూరు గ్రామం వద్ద కొత్తరకం పంట సాగు చేస్తుండడంతో వాహదారులు, ప్రయాణికులు పండ్ల తోటను ఆసక్తిగా తిలకిస్తున్నారు. మండలంలోని గాజులపెళ్లూరు గ్రామంలోని రాసా జ్యూస్ ఫ్యాక్టరీ యాజమాని రైతు రమణారెడ్డి కాటూరు రెవెన్యూలో తనకున్న 6 ఎకరాల పొలంలో, పూసలపల్లికి చెందిన రైతు గజేంద్రనాయుడు 10 ఎకరాల్లో డ్రాగన్ ఫ్రూట్ సాగు చేస్తున్నారు. సాధారణంగా మొక్కలు నాటిన రెండేళ్లకు పండ్లు దిగుబడి రావాల్సి ఉండగా రైతులు రమణారెడ్డి, గజేంద్రనాయుడు నాణ్యమైన మొక్కలు, సరైన పద్ధతులు చేపట్టడంతో నాటిన 11 నెలలకే పండ్ల దిగుమతి మొదలైంది. రైతులు మాట్లాడుతూ వరి, వేరుశనగ పంటల సాగులో ఆశించిన లాభాలు రాకపోగా, నష్టాలు ఎదురవుతుండడంతో ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించినట్లు తెలిపారు. అందులో ఖరీదైన పండ్లు కిలో రూ.200 నుంచి 400 వరకు ధర కావడంతో పాటు ఆరోగ్యానికి ఎంతో ఉపయోగకరంగా ఉండడంతో ఈ పండ్ల సాగు ఎంచుకున్నట్లు తెలిపారు. ఎకరాకు రూ.6 లక్షల వరకు పెట్టుబడి కింద ఖర్చు చేసినట్లు, ఒకసారి దిగుబడి మొదలైతే 30 సంవత్సరాల వరకు ఫలితాన్నిస్తుందన్నారు. పూర్తిస్థాయిలో దిగుబడి వస్తే ఏడాదికి ఎకరాకు రూ.2 లక్ష ఆదాయం వస్తుందన్నారు. తాను సాగు చేయడమే కాకుండా తమ గ్రామంలోని ఆసక్తి ఉన్న రైతులకు మొక్కలు అందించి సాగు చేసే విధంగా ప్రోత్సహిస్తామన్నారు. పంట దిగుబడి ఇతర రాష్ట్రాల్లో విక్రయించే విధంగా ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. దీంతో పలువురు రైతులు ఈ పంట సాగుపై ఆసక్తి చూపుతున్నారు.



డ్రాగన్ ఫ్రూట్ కాయలు

ప్రజలకు అండగా ఉంటా



పిచ్చాటూరు:ఎమ్మెల్యేను సన్మానిస్తున్న టీడీపీ శ్రేణులు

పిచ్చాటూరు: తనను ఎన్నికల్లో గెలిపించిన సత్యవేడు నియోజకవర్గ ప్రజలకు ఎళ్ల వేళలా అండగా ఉంటానని ఎమ్మెల్యే ఆదిమూలం అన్నారు. శనివారం ఉదయం 10 గంటలకు పిచ్చాటూరులో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. అక్కడ నుంచి స్థానిక టీడీపీ కార్యాలయానికి చేరుకుని కార్యకర్తలతో ఆయన సమావేశమయ్యారు. రెండవ సారి ఎమ్మెల్యే అయిన తరువాత తొలిసారి మండలానికి వచ్చిన ఆదిమూలంను పార్టీ శ్రేణులు గజమాలతో సత్కరించారు. క్లస్టర్ ఇన్‌చార్జ్ ఇళంగోవన్ రెడ్డి, నేతలు వాసురెడ్డి, సతీష్‌నాయుడు, భక్తారెడ్డి, పద్మనాభరాజు, దొరవేలు, వాసు పాల్గొన్నారు.

ప్రతి కార్యకర్తకు అండగా ఉంటా!

సత్యవేడు: నా విజయానికి శ్రమించిన ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. శనివారం మస్తాన్ కల్యాణ మండపంలో సన్మాన సభ జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో తనను ఆదరించిన పార్టీ కార్యకర్తల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి మండల నాయకులతో కలిసి సమష్టిగా పనిచేస్తామన్నారు. కార్యకర్తలకు ఏ కష్టమొచ్చినా ఫోన్ చేస్తే వెంటనే స్పందిస్తామని తెలిపారు. టీడీపీ కార్యకర్తలు ఎమ్మెల్యేను సన్మానించారు. మాజీ జెడ్పీ వైస్‌చైర్మన్ కె.సుందరరామిరెడ్డి, మాజీ ఎంపీపీ వి.మస్తాన్, నేతలు ప్రవీణ్, వీకే.పరమశివం పాల్గొన్నారు.

ఆశ్రమాలకు దాతల చేయూత



మేరి వృద్ధాశ్రమం నిర్వాహకులతో దాతలు

నాయుడుపేట టౌన్: పట్టణంలోని మేరి వృద్ధాశ్రమంలో వృద్ధులకు, చేయూత అనాథ పిల్లల ఆశ్రమంలో పిల్లలకు ప్రముఖ గైనకాలజిస్టు డాక్టర్ మారంరెడ్డి అభిజ్ఞ, డాక్టర్ సుదీప్ రెడ్డి దంపతులు శనివారం చేయూత అందించారు. వారి కుమారుడు ఆరవ్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా పలు సంక్షేమ కార్యాక్రమాలు చేపట్టారు. ఆశ్రమంలో ఉన్నవారికి భోజన సౌకర్యం ఏర్పాటు చేశారు. ఆశ్రమ నిర్వాహకులు వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దాతలతోపాటు నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

నాయుడుపేట టౌన్: పట్టణంలోని బ్రాహ్మణ వీధిలో ఉన్న శ్రీవ్యూహలక్ష్మీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద ఉదయం నుంచి స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు జరిపి ప్రత్యేక అలంకరణ చేపట్టారు. ఈ పూజలలో భక్తులు, సుబ్రహ్మణ్యం పీఠం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ కాంప్లెక్స్‌లో ఎస్పీ తనిఖీలు

తిరుపతి క్రైమ్: తిరుమల పోలీస్ కాంప్లెక్స్‌ను జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు శనివారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ శ్రీవారి భక్తులతో మర్యాద పూర్వకంగా హుందాగా వ్యవహరించాలని, పోలీస్ ప్రఖ్యాతిని ప్రపంచ స్థాయికి పెంచాలని మన లక్ష్యం అన్నారు. అలిసిపోయి సేద తీరుతున్న భక్తుల వద్ద నుంచి చిన్న పిల్లలను, విలువైన ఆభరణాలను, మొబైల్ ఫోన్లను దొంగలించే వారిపై నిరంతరం నిఘా పెట్టాలన్నారు. స్థానిక బాలాజీ నగర్ పరిసరాలపై నిరంతరం నిఘా ఏర్పాటు చేసి పర్యవేక్షించాలన్నారు. భవన నిర్మాణ కార్మికులు, తాపీ మేస్త్రీలు వివరాలను పోలీస్ స్టేషన్‌లో నమోదు చేసుకుని వారి కార్యకలాపాలపై నిఘా ఉంచాలన్నారు. సమావేశంలో ఏఎస్పీలు వెంకట్రావు, శివరామిరెడ్డి, డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.

గ్రామీణాభివృద్ధిలో యువత భాగస్వామ్యం

రేణిగుంట : గ్రామీణాభివృద్ధిలో యువత భాగస్వామ్యం ఆవశ్యకమని రాస్ ప్రాజెక్ట్ ఆఫీసర్ రమేష్‌రెడ్డి అన్నారు. మండలంలోని కరకంబాడి రాస్ ప్రాజెక్టు కార్యాలయంలో యువజన సంఘ సభ్యులకు గ్రామీణ సామాజిక సమస్యలు పరిష్కారం అనే అంశంపై శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ యువతను కొన్ని సమూహాలుగా ఏర్పాటు చేసి గ్రామాల్లో నెలకొన్న సామాజిక సమస్యలను గుర్తించేందుకు రాస్ కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. యువజన సంఘ సభ్యులు చిత్తశుద్ధితో పనిచేస్తూ సమస్యల పరిష్కారానికి తోడ్పడాలని ఆయన కోరారు. రాస్ సమన్వయకర్త నాగేంద్రశర్మ, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

కాశీ క్షేత్రంలో లోకక్షేమం కోసం విశేష హోమాలు



కాశీలోని కేదార్ ఘాట్‌లో హోమాలు నిర్వహిస్తున్న అర్చక బృందం

వాకాడు: చిట్టమూరు మండలం మల్లాం గ్రామంలో వెలసిన కామాక్షిదేవి సమేత మార్కండేశ్వర స్వామి ఆలయ ప్రధాన అర్చకుడు గూడలి సుధీర్ శర్మ ఆధ్వర్యంలో అర్చక బృందం లోకక్షేమం కోసం మూడు రోజులుగా కాశీలో విశేష హోమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుధీర్‌శర్మ శనివారం వాకాడులో మాట్లాడుతూ లోకక్షేమంతో పాటు సర్వజనుల శ్రేయస్సు కోరుతూ కాశీక్షేత్రంలో గత మూడు రోజులుగా విశేష హోమాలు, సత్యనారాయణస్వామి వ్రతం, నవగ్రహ హోమం, మహాగణాధిపతి హోమం, రుద్రహోమం, మృత్యుంజయ హోమం, కాలభైరవ హోమం, మహాపాశుపత హోమం, లక్ష్మీకుబేర హోమం, కాశీవిశ్వనాథునికి మహన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకం, అన్నపూర్ణాదేవికి కుంకుమపూజ వైభవంగా నిర్వహించారు. ఈ పూజల్లో కాశీలోని ప్రముఖ పండితుడు నుదురుపాటి పార్వతీశం శర్మతోపాటు గూడలి చంద్రశేఖర్‌శర్మ, సరస్వతుల సుబ్రమణ్యం శర్మ, జనమంచి పవన్‌కుమార్‌శర్మ, గూడలి నవీన్ బ్రహ్మశర్మ, షణ్ముఖ హర్షిత్‌శర్మ పాల్గొన్నారు.



కాశీలో పూజలు నిర్వహిస్తున్న అర్చక బృందాలు

నిరాశాజనకంగా మామిడి

- పూతలేక తగ్గిన దిగుబడి
- ప్రతికూల వాతావరణమే కారణం

పిచ్చాటూరు: ఈ ఏడాది మామిడి పంట నిరాశాజనకంగా ఉందని రైతులు అంటున్నారు. ప్రతికూల వాతావరణం కారణంగా ఈ ఏడాది మామిడి కరువైంది. పూతలేక దిగుబడి తగ్గిపోయింది. ఈ ఏడాది వర్షాభావంతో ఆలస్యంగా పూత వచ్చిందని, వచ్చిన పూత కూడా ప్రతికూల వాతావరణం కారణంగా నిలువలేకపోవడంతో దిగుబడి నిరాశాజనకంగా మారిందని వ్యవసాయ నిపుణులు అంటున్నారు. ఏప్రిల్ రెండవ వారం నాటికి మామిడి పండ్లు మార్కెట్‌కు రావాల్సి ఉన్నా ఈ ఏడాది ఆలస్యంగా అంతంత మాత్రం వస్తున్నాయి. వెంకటరెడ్డి కండ్రిగ, గొల్లకండ్రిగ, రెప్పాలపట్టు, యానాది ఇండ్లు, సిద్ధిరాజు కండ్రిగ, బంగళా, చెంచురాజుకండ్రిగ, శివగిరి, పులికుండ్రం, అడవిశంకరాపురం, అప్పలరాజు కండ్రిగ గ్రామాల్లో 350 ఎకరాల్లో మామిడి తోటలు విస్తరించి ఉన్నాయి. వీటిపై పలువురు కౌలు రైతులు ఆధారపడి జీవిస్తున్నారు.

పూత ఆలస్యమే కారణం..

మామిడి పూత డిసెంబర్‌లో ప్రారంభమై జనవరి మొదటి వారానికి చెట్లన్నింటికీ పూత రావాల్సి ఉంటుంది. ఈ మాసాల్లో వచ్చిన పూత వల్లనే కాయలు నిలుస్తాయి. అలా కాకుండా వర్షాభావం, ప్రతికూల వాతావరణం కారణంగా ఫిబ్రవరిలో పూత రావడం, వచ్చిన పూత నిలువలేకపోవడం, ఎండలు విపరీతంగా ఉండడంతో వచ్చిన 70 శాతం పూత రాలిపోయింది. నిలిచిన పూత, పిందె ఎదుగుదల లేకుండా ఎర్రబారిపోయి నేలరాలింది. మిగిలిన పూతతో సక్రమంగా దిగుబడి పూర్తిగా రాక తగ్గింది. కాయ నిలవాలని వేలాది రూపాయలు ఖర్చు చేసి మందులు కొట్టినా ఫలితం లేకుండా పోయింది. దీనికి తోడు పెనుగాలులకు రోజూ కాయలు రాలి ఈ ఏడాది నష్టపోయామని మామిడి రైతులు ఆందోళన చెందుతున్నారు.


కొండెక్కిన మామిడి ధరలు..

మామిడి దిగుబడి ఈ ఏడాది గణనీయంగా తగ్గినందున ధరలు భారీగా పెరిగాయని మామిడి మండీ వ్యాపారుల అంటున్నారు. ప్రారంభలోనే కిలో బేనీషా రకం రూ.70 నుంచి రూ.100 వరకు ఉంటుందని వ్యాపారులు పేర్కొంటున్నారు. మామిడి సీజన్ మూడు నెలల పాటు ఏప్రిల్ 15 నుంచి జూలై 15 వరకు ఉంటుంది. కానీ ఈ ఏడాది జూన్ 15 నాటికే మామిడి కరువయ్యే పరిస్థితులు నెలకొన్నాయి.



సిద్ధిరాజు కండ్రిగలో కాపు తక్కువగా ఉన్న చెట్లు


పూత ఆలస్యం..



ఈ సంవత్సరం పూత ఆలస్యంగా వచ్చింది. ఏటా ఏప్రిల్‌లోనే మామిడి పండ్లు వచ్చేవి. మామిడి పూత లేక నేటికీ అరకొరగా కాసిన మామిడి పంటను అమ్ముకోలేకపోతున్నాం. కూలీలు కూడా గిట్టుబాటు కావడం లేదు.

–రామచంద్రరాజు, మామిడి రైతు, పులికుండ్రం

ఈ సారి నష్టాలే..



200 చెట్లున్న మామిడి తోటను రూ.3 లక్షలకు కౌలుకు తీసుకున్నాం. వానల్లేక పూత ఆలస్యంగా వచ్చింది. పక్క రైతు వద్ద రెండు నెలలకు రూ.10 వేలు ఇచ్చి నీటి తడులు ఇచ్చాం. అయినా ఆశించినంత పూత రాలేదు. అరకొరగా కాసిన మామిడి కాయలు ఈదురుగాలులకు రోజూ రాలిపోతున్నాయి. ఆశించిన కాపు లేక నష్టపోతున్నాం.

–జి. రఫి, మామిడి కౌలు రైతు, కీళపూడి

నేత్రపర్వం.. కల్యాణ వెంకన్న ఊంజల్ సేవ



ఊంజలసేవలో ఉభయ నాంచారులతో స్వామివారు

నారాయణవనం: మండల కేంద్రంలో టీటీడీ అనుబంధ ప్రసిద్ధ శ్రీపద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం సాయంత్రం దేవదేవేరులు ఊయ్యాల సేవలో భక్తులను అనుగ్రహించారు. వేకువజామున సుప్రభాత సేవతో శ్రీస్వామివారిని మేల్కొలిపి నిత్యపూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదా లను అందుకున్నారు. సాయంత్రం కై ంకర్యాలను పూర్తి చేసిన అర్చకులు శ్రీదేవీ, భూదేవీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి తిరుచ్చిపై అధిష్ఠింపజేసి ఊరేగింపుగా ఊంజల్ మండపానికి వేంచేపు చేసి ఊయలలో కొలువుదీర్చారు. అనంతరం వేదనాద కచేరీల నడుమ స్వామి,అమ్మవార్లు ఊయలలో సేదతీరుతూ భక్తులను దర్శనమిచ్చారు.

సింగిల్ విండో చైర్మన్ పదవికి రాజీనామా

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కాటూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ పదవికి పల్లంపర్తి హరనాథరెడ్డి రాజీనామా చేస్తున్నట్లు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఓటమి తనను ఎంతగానో బాధించిందని తెలిపారు. తనకు సహకారం అందించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు చెప్పారు. తన రాజీనామా లేఖను జిల్లా చైర్‌పర్సన్‌కు పంపుతున్నట్లు తెలిపారు.

డైరెక్టర్ల రాజీనామా

నారాయణవనం: నారాయణవనం పీఏసీఎస్(సింగల్ విండో) డైరెక్టర్లు హేమచంద్రారెడ్డి, మనోహర్ తమ పదవులకు శనివారం రాజీనామా చేశారు. ఈ మేరకు రాజీనామ పత్రాలను పీఏసీఎస్ కార్యదర్శికి, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు సీఈఓకు పంపారు. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఓటమి నేపథ్యంలో నైతిక బాధ్యత వహిస్తూ డైరెక్టర్ల పదవులకు రాజీనామా చేసినట్లు వారు తెలిపారు.

టౌన్‌బ్యాంకు డైరెక్టర్ పదవికి..

శ్రీకాళహస్తి కోఆపరేటివ్ టౌన్‌బ్యాంకు డైరెక్టర్ పదవికి పట్టణానికి చెందిన వైఎస్సార్ సీపీ ముస్లిం మైనారిటీ నాయకురాలు సాగీరాబీ శనివారం రాజీనామా చేశారు. ఆమె మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ పరాజయంతో ఈ పదవికి రాజీనామా చేసినట్లు తెలిపారు.

కండలేరులో 6.544 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో శనివారం నాటికి 6.544 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 15 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 40, లోలెవల్ కాలువకు 40 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

విస్తారంగా సజ్జ సాగు



గాజులపెళ్లూరులో సజ్జ సాగు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని గాజులపెళ్లూరు, ఆలత్తూరు, నీర్పాకోట, వెస్టువరత్తూరు, కనమనంబేడు, జీఎన్‌కండ్రిగ, కాంపాళ్లెం, గ్రామల్లోని రైతులు సజ్జ పంటను విస్తారంగా సాగుచేస్తున్నారు. 300 ఎకరాలలో సజ్జ పంటను రైతులు వేశారు. ఆరుతడి పంట కావడంతో నీటి సమస్య లేకపోవడంతో రైతులు మెట్ట భూముల్లో సజ్జ పంటను ఎక్కువగా వేస్తున్నారు. సజ్జ పంటకు మార్కెట్‌లో ఎక్కువగా డిమాండ్ ఉండడంతో ఎకరాకు అన్ని ఖర్చులు పోను రూ.25 వేలు మిగులుతుంది. పెట్టుబడి, నీటి ఖర్చు తక్కువగా ఉండడంతో రైతులు సజ్జ సాగుపై మక్కువ చూపుతున్నారు. ప్రభుత్వం సబ్సిడీపై సజ్జ పంటకు కావలసిన ఎరువులను, పురుగు మందులను పంపిణీ చేయాలని రైతులు కోరుతున్నారు.

ఘనంగా మహాభారత ఉత్సవాలు ప్రారంభం



కుంభం పూజలు చేస్తున్న అర్చకులు

ఏర్పేడు: మండలంలోని పాతవీరాపురంలో శ్రీద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. శుక్రవారం అర్ధరాత్రి ధ్వజారోహణం నిర్వహించారు. శనివారం ఉదయం శ్రీస్వామి,అమ్మవార్ల విగ్రహాలకు పలు రకాల అభిషేక పూజలు నిర్వహించారు. ధ్వజస్తంభం వద్ద నైవేద్యాన్ని కుంభం వేసి పూజలు చేశారు. సాయంత్రం పాండవులు, కౌరవుల జననం హరికథా గానం జరిగింది. పోతురాజుతో పాటు స్వామి,అమ్మవార్ల ఉత్సవ మూర్తులను పురవీథుల్లో ఊరేగించారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు.

ముకుందా..ముకుందా..!



భరతనాట్యంతో అలరిస్తున్న కళాకారులు

చంద్రగిరి(తిరుచానూరు): వారాంతపు సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో రెండో శనివారం కావడంతో సాయంత్రం నిర్వహించిన భరతనాట్యం ప్రేక్షకులను అలరించింది. తిరుపతికి చెందిన నటరాజ్ డ్యాన్స్ శనివదారం ఆధ్వర్యంలో కళాకారులు నిర్వహించిన భరత నాట్యం విశేషంగా ఆకట్టుకుంది. ఇందులో భాగంగా వినాయక స్తోత్రం, భరత వేదమున, గురు బ్రహ్మ, నీలినీలి కళ్లవాడే, అదివో అల్లదివో, వేయి నామాల వాడ, ముకుందా ముకుందా, హర హర శంకర వంటి పాటలకు కళాకారులు లాలస్ రాజ్, హేమశ్రీ, దీపిక, వార్షిక, రేషిక, శ్రీభవ్య, సాజేష్, అక్షయ, హర్షిణి, సాత్విక, యజ్ఞశ్రీ, పర్ణశ్రీ, దాన్విక, వేదాంక్షి, వర్షుకల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పాటకు తగ్గ అభినయం, హావభావాలతో కళాకారులు చూడచక్కని నృత్యాలను ప్రదర్శించడం ద్వారా ప్రేక్షకులు కరతాళ ధ్వనులతో వారిని అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కళాకారులను ఏఓ ఖాదర్‌వల్లీ సత్కరించి, జ్ఞాపకలను అందజేశారు. కార్యక్రమంలో రాధాకష్ణ, పప్పి, వరప్రసాద్, నరేష్ పాల్గొన్నారు.



తిరుచ్చిపై శ్రీనివాసుని కటాక్షం



తిరుచ్చి వాహనంపై విహరిస్తున్న శ్రీవారు

పుత్తూరు: అప్పలాయగుంటలో వెలసిన శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి తిరుచ్చిపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. శనివారం వేకువ జామున సుప్రభాత సేవతో శ్రీవారిని మేల్కొలిపి, నిత్య కై ంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం ఉభయ నాంచారుల సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామిని, పట్టు పీతాంబరాలు, విశేష స్వర్ణాభరణాలు, సుగంధ పరిమళభరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి ఊయలలో కొలువు దీర్చారు. భక్తి కీర్తనల నడుమ శ్రీవారి ఊంజల్ సేవ కనుల పండువగా జరిగింది. అనంతరం సర్వాలంకార భూషితుడైన శ్రీవారు ఉభయ దేవేరులతో కలిసి తిరుచ్చి వాహనంపై కొలువుదీరారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ మాడవీధుల్లో గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. భక్తులు నారికేళ, కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులను కటాక్షించి ఆలయానికి చేరుకున్న స్వామి అమ్మవార్లకు మంగళహారతులిచ్చి పవళింపు సేవ నిర్వహించారు.